ప్రజాశక్తి
ఆదివారం 28 మే 2023
5
విజయనగరం



ప్రజాశక్తి బుక్‌హౌస్‌లో పాఠ్యపుస్తకాలు విక్రయం

ప్రజాశక్తి-విశాఖపట్నం

విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం, అనకాపల్లి, అల్లూరి (పాడేరు, అరుకు) జిల్లాల్లో 1 నుండి 10 తరగతుల వరకు ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను ప్రజాశక్తి బుక్‌హౌస్‌లో విక్రయించనున్నట్లు బుక్ హౌస్ మేనేజర్ బి.శ్రీనివాస్ తెలిపారు. అందులో భాగంగా 10వ తరగతి పాఠ్య పుస్తకాలను ఈనెల 28నుండి ప్రజాశక్తి ఆటోనగర్‌లో హోల్‌సేల్ డీలర్లకు, సోమవారం నుంచి విశాఖలోని అల్లూరివిజ్ఞాన కేంద్రంలోగల ప్రజాశక్తి బుక్‌హౌస్‌లో రిటైల్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. పాఠ్యపుస్తకాలు కావాల్సిన వారు 9490099061/ 9490099133 నెంబర్లను సంప్రదించాలని, ఈ అవకాశాన్ని స్కూలు యాజమాన్యాలు, తల్లిదండ్రులు వినియోగించు కోవాలని కోరారు.

ఉపాధ్యాయులకు పాట్లు

- బదిలీ ఉత్తర్వులతో తంటాలు
- అకడమిక్ ఇయర్ పేరిట పాయింట్లలో కోత
- లబోదిబోమంటున్న ఉపాధ్యాయులు



డిఇఒ కార్యాలయంలో బదిలీల దరఖాస్తులను పరిశీలిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యాశాఖలో బదిలీలకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 47 ఉపాధ్యాయులకు తలనొప్పిగా మారింది. ఈ జిఒలో పేర్కొన్న పలు అంశాలు 2015లో చేరిన ఉపాధ్యాయులకు శఠగోపంగా మారింది. ఎనిమిదేళ్ల అడకమిక్ సంవత్సరాలు ఆధారంగా బదిలీలు చేపట్టనుండటంతో 2015లో చేరిన ఉపాధ్యాయులకు 22 పాయింట్లు మించి రాకపోవడంతో వందల సంఖ్యలో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. 2017లో రేషలైజేషన్‌కు గురైన వారికి ఓల్డ్ స్టేషన్ పాయింట్లతో పాటు రేషలైజేషన్ పాయింట్‌లు 5 ఇచ్చారు. ఈ విధానం జీవోలో పేర్కొన్న అంశాలకు, గత సంప్రదాయానికి విరుద్ధంగా ఉందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఓల్డ్‌స్టేషన్ పాయింట్‌లు ఇచ్చినా అభ్యంతరం లేదని, కానీ అదనంగా ఐదు పాయింట్లు ఇవ్వడం వల్ల మిగతా ఉపాధ్యాయులు నష్టపోతారని బాధిత ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు. దీనివల్ల 15ఏళ్ల సర్వీస్ ఎక్కువ ఉన్న టీచర్ కూడా బదిలీల సీనియారిటీ జాబితాలో వెనక్కి వెళ్లిపోయే ప్రమాదం ఉంది. అలా అని 8ఏళ్ల సీలింగ్ పెడితే 2013లో చేరిన ఉపాధ్యాయులు నష్టపోనున్నారు. ఈ నేపథ్యంలో 2015 వారికి తప్పనిసరి బదిలీ నుంచి తప్పించడమే మార్గమని అభిప్రాయ పడుతున్నారు.

ఉదాహరణకు.. 2015 నవంబర్ 18లోపల జాయిన్ అయిన వారికి 8 ఏళ్లకు 24 పాయింట్లు రావడం లేదు. 22.7 పాయింట్స్ మాత్రమే వస్తున్నాయి. నిజానికి 2017లో బదిలీ అయినా వారు పాఠశాలలో ఏడున్నర సంవత్సరాలు మాత్రమే పూర్తి చేసుకున్నారు. కానీ తాజా జీవో ప్రకారం 8 అకడమిక్ సంవత్సరాలు అని చెప్పి వారిని బలవంతంగా బదిలీకి దరఖాస్తు చేయమన్నారు.వారికి 8ఏళ్లు పూర్తయ్యాయని బదిలీ చేస్తున్నారు. కానీ వీరికి 8 ఏళ్లకు రావాల్సిన పాయింట్లు రాకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. బదిలీలలో ఇటువంటి అసంబద్ధ నిబంధనలుఉపాధ్యాయులకు నష్టం కలిగించేవిగా ఉన్నాయని రూల్స్ ని వెనక్కి తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

బదిలీలకు ముగిసిన దరఖాస్తు ప్రక్రియ

ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి దరఖాస్తు గడు వు శుక్రవారం రాత్రి తో ముగిసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,294 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ప్రధానోధ్యాయులు 138 మంది, స్కూల్ అసిస్టెంట్లు 1,979 మంది, ఎస్‌జిటిలు 2,177 మంది ఉన్నారు. శనివారం ధ్రువపత్రాల పరిశీలన జరగనుంది. బదిలీల సమస్యల పరిష్కారానికి డిఇఒ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూంఏర్పాటు చేశారు.

అసంబద్ధ జిఒకు వ్యతిరేకంగా ఉద్యమ కార్యాచరణ

ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి అసంబద్ధమైన నిర్ణయాలు, జిఒలో ఉన్న లోపాలను సవరించాలని కోరుతూ ఆదివారం ఉదయం ఉమ్మడి జిల్లా విజయనగరం కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శనకు ఫ్యాప్టో పిలుపునిచ్చింది. అన్ని కేడర్లలో ఉద్యోగోన్నతులను మాన్యువల్‌గా మాత్రమే నిర్వహించాలని, బదిలీలలో అసంబద్ధాలను తొలగించి, పోస్టులను బ్లాక్ చేయకుండా ఖాళీలన్నింటినీ ప్రదర్శించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ బి.మహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటరావు, డి.శ్యామ్, జెవిఆర్‌కె ఈశ్వరరావు, పి.శ్రీనివాసరావు, సన్యాసిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇకపై బిల్లుల చెల్లింపులు వేగవంతం

- కన్వర్జెన్స్ పనులపై మంత్రి బొత్స ఆదేశాలు
- గడపగడపకులో మంజూరైన పనులన్నీ వెంటనే ప్రారంభించాలి
- ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం

ఉపాధిహామీ కన్వెర్జెన్స్, గడపగడపకు మన ప్రభుత్వం వంటి కార్యక్రమాల కింద మంజూరైన పనులకు రాష్ట్ర ప్రభుత్వం బిల్లుల చెల్లింపును వేగవంతం చేస్తోందని, ఈ పనులను రికార్డు చేయడం, బిల్లులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం తదితర ప్రక్రియ తక్షణం పూర్తిచేయాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వచ్చే నాలుగు నెలల కాలంలో ఈ కార్యక్రమాల కింద చేపట్టిన పనులకు బిల్లుల చెల్లింపులో సమస్యలు వుండబోవన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఇంజనీరింగ్ పనులపై ప్రజాప్రతినిధులు, అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఉపాధిహామీ కన్వర్జెన్స్ నిధులతో చేపట్టిన పనులను ఇకపై ప్రతివారం రికార్డుచేసి, శనివారానికి ఆన్‌లైన్‌లో బిల్లులు అప్‌లోడ్ చేయాలన్నారు. అందుకు ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగాల మధ్య సమన్వయం అవసరమని చెప్పారు. జిల్లాలో ఫస్ట్ సిగ్నేటరీ కింద అప్‌లోడ్ చేసిన రూ.38 కోట్లు, రెండో సిగ్నటరీ కింద అప్‌లోడ్ చేసిన బిల్లులు మరో రూ.12 కోట్లు పెండింగ్‌లో వున్నాయని వాటిని త్వరగా చెల్లించేలా చర్యలు చేపట్టాలని మంత్రి పిఆర్ రాష్ట్ర స్థాయి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సూచించారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి గాని, కలెక్టర్ నాగలక్ష్మి దృష్టికి గాని ఇంజనీరింగ్ అధికారులు తీసుకురావాలన్నారు.గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జిల్లాలో మంజూరైన పనులన్నీ వెంటనే ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. మున్సిపల్ ప్రాంతాలు, విద్యుత్ ప్రాంత పంపిణీ సంస్థకు సంబంధించిన పనులకు నిధులు మంజూరు కాలేదని సిపిఒ బాలాజీ తెలిపారు. విద్యుత్ పనులకు సంబంధించి ఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రభుత్వమే బిల్లులు చెల్లిస్తున్నందున ముందస్తుగా నిధుల కోసం కోరకుండా మంజూరైన పనులు వెంటనే చేపట్టాలని మంత్రి సూచించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం పనులకు బిల్లుల చెల్లింపుపై కూడా మంత్రి సమీక్షించారు. జిల్లాలో గడపగడపకు మన ప్రభుత్వం కింద 1055 పనులు మంజూరు చేయగా 858 ప్రారంభించినట్లు పంచాయతీరాజ్ ఎస్ఇ గుప్తా వివరించారు. ఉపాధిహామీ, గడపగడపకు మనప్రభుత్వం కింద చేపట్టిన పనులు ఎలా జరుగుతున్నాయో తరచుగా మండలాల్లో పర్యవేక్షించాలని డిపిఒ శ్రీధర్‌రాజా, జిల్లాపరిషత్ డిప్యూటీ సిఇఒ రాజ్‌కుమార్‌ను మంత్రి ఆదేశించారు. జిల్లాలో ధాన్యం సేకరణ పరిస్థితిపై మంత్రి పౌరసరఫరాల అధికారులు, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తో చర్చించారు. రబీ సీజనులో జిల్లాలో పెద్దగా లక్ష్యాలేమీ నిర్దేశించలేదని జె.సి. పేర్కొన్నారు.

అధికారులకు మంత్రి అభినందన

ఉపాధిహామీ పనుల్లో జిల్లా జాతీయ స్థాయిలోనే మొదటి స్థానంలో నిలవడం గర్వకారణమని మంత్రి పేర్కొంటూ అధికారులను అభినందించారు. ఉపాధి పనుల్లో మన జిల్లా ప్రతిఏటా ఉత్తమ పనితీరును కనబరుస్తోందని, అదే పంథాను కొనసాగిస్తూ ఈ ఏడాది జాతీయస్థాయిలో మొదటి స్థానంలో నిలవడం పట్ల సంతోషం వ్యక్తంచేశారు. సమావేశంలో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, పంచాయతీరాజ్ ఎస్ఇ గుప్తా, గ్రామీణనీటి సరఫరా ఎస్ఇ ఉమాశంకర్, ఇపిడిసిఎల్ ఎస్ఇ నాగేశ్వరరావు, డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి, మున్సిపల్ సహాయ కమిషనర్ ప్రసాదరావు, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ మీనాకుమారి, డిఎస్ఒ మధుసూదనరావు, డిపిఒ శ్రీధర్‌రాజా పాల్గొన్నారు.



రక్తదాతను అభినందిస్తున్న వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు

కోలగట్ల జన్మదినం సందర్భంగా

రక్తదాన శిబిరాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి జన్మదినోత్సవం నేపథ్యంలో ఆ పార్టీ నాయకులు పెద్దఎత్తున రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. కోలగట్ల నివాసం వద్ద రక్తదాన శిబిరాన్ని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ ప్రారంభించారు. వైసిపి నాయకులు, యువజన విభాగం ఆధ్వర్యంలో ఏడు చోట్ల రక్తదాన శిబిరాలను నిర్వహించి 1,030 మంది రక్తదాతల నుండి 1,030 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ అందరి ఆదరాభిమానాలను చూరగొని, అభిమాన పాత్రుడిగా, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల నిలిచారని అన్నారు. ఆయనపై ఉన్న అభిమానాన్ని చాటుకునే విధంగా యువకులు, విద్యార్థి విభాగం, వైసీపీ శ్రేణులు స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. నగరంలోని కాకతీయ కల్యాణ మండపంలో మండల పార్టీ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పలువురు యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు నడిపల్లి శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి సభ్యులు కెల్ల శ్రీనివాసరావు, ఎంపిపి మామిడి అప్పలనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు కెల్ల త్రినాధ్, సర్పంచులు కోరాడ మహేష్, నాగరాజు, సాయి, ఎస్‌వి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోలగట్ల నివాసంలో జరిగిన కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, రేవతి దేవి, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, యువజన విభాగం నాయకులు ఈశ్వర్ కౌశిక్ , వైసిపి నగర అధ్యక్షుడు ఆశపు వేణు, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండల డైరెక్టర్ సంగం రెడ్డి బంగారు నాయుడు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, జోనల్ ఇన్చార్జులు తదితరులు పాల్గొన్నారు. తోటపాలెం వైసిపి నాయకులు భోగాపురపు రవిచంద్ర ఆధ్వర్యాన పలువురు యువకులు రక్తదానం చేయగా, ఈశ్వర్ కౌశిక్ వారిని అభినందించారు.

నేడు 6వ ఫుడ్ బ్యాంక్ ప్రారంభం

కోలగట్ల జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కొత్తపేట నీళ్ల ట్యాంకు వద్ద ఆరవ ఫుడ్ బ్యాంక్ ను ప్రారంభించనున్నట్లు డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి తెలిపారు. శనివారం నగరంలో ఏర్పాటైన రక్తదాన శిబిరాలను ఆమె సందర్శించి అభినందించారు. కోలగట్ల పుట్టిన రోజు సందర్భంగా మండలంలో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలను పార్టీ శ్రేణులు నిర్వహిస్తున్నాయన్నారు. విరివిగా అన్నదాన కార్యక్రమాలు, దేవాలయాలలో పూజలు, కొన్నిచోట్ల పేదలకు గొడుగులు, చెప్పులు పంపిణీ, దంత వైద్య శిబిరాలు వంటివి నిర్వహించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా కొత్తపేట నీళ్ళ ట్యాంకు వద్ద పేద ప్రజల ఆకలి బాధలను తీర్చే ఫుడ్ బ్యాంకును ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్పొరేటర్ బండారు ఆనందరావు, కోలగట్ల తమన్న శెట్టి, ఎస్ వి వి రాజేష్, ఆశపు వేణు, అల్లు చాణక్య, గుజ్జల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు

అగ్రహారం రైతులకు హక్కులు

- 2050 ఎకరాలకు పబ్లిక్ నోటీసు
- నెల రోజుల్లోపు అభ్యంతరాలకు అవకాశం
- మరో 500 ఎకరాలకు పెండింగ్
- త్వరలో పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు



జామిలో అగ్రహారం భూమి

ప్రజాశక్తి - జామి

జామి అగ్రహార భూముల రైతులకు రెవెన్యూ అధికారులు తీపి కబురు చెప్పారు. తాతలు తండ్రుల నుంచి భూములు సాగు చేస్తున్నా... అన్నదాతకు ఎటువంటి హక్కులూ లేవు. దీంతో భూములున్నా భరోసా లేని బతుకుగా ఇన్నాళ్లు నష్టపోయారు. కష్ట సమయాల్లో భూములు అమ్ముకొందామన్నా క్రయవిక్రయాలు జరగక తీవ్రంగా నష్టపోయారు. ఎట్టకేలకు రైతులకు మోక్షం కలిగింది. శనివారం 2050 ఎకరాలకు జామి తహశీల్దార్ హేమంత్ కుమార్ పబ్లిక్ నోటీసు విడుదల చేశారు. అగ్రహార భూములన్నీ 915 సర్వే నంబర్ కింద ఉండేవి. కానీ ఇటీవల జరిగిన సర్వేతో నూతన సర్వే నంబర్లను ఏర్పాటు చేసి, జిల్లా సర్వే శాఖ రికార్డు తయారు చేసింది. ఈ రికార్డుకు సంబంధించి, అభ్యంతరాలను నెలరోజుల్లో రెవెన్యూ అధికారులకు తెలియజేసే అవకాశం కల్పిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలోనే అగ్రహార రైతాంగానికి ఊరట కలిగిందని చెప్పొచ్చు.

జామి మండల కేంద్రంలో 2,549 ఎకరాలు అగ్రహార భూములు ఉన్నాయి. వీటికి దాదాపుగా 2009 సంవత్సరంలో సర్వే ప్రారంభమైంది. జిల్లా సర్వే శాఖ ఆధ్వర్యంలో నూతన సర్వే బృందాలను ఏర్పాటు చేసి ఇన్నేళ్లు సర్వే చేశారు. ఎట్టకేలకు 2050 ఎకరాలకు రికార్డు పరిశీలన పూర్తయింది. ఈ మేరకు పబ్లిక్ నోటీసు విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మ్యాపులు అందించాలి

కొత్త సర్వే నంబర్లతో నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ, వాటికి సంబంధించిన మ్యాపులు ప్రతి రైతుకూ అందించాలని రెవెన్యూ అధికారులను కోరుతున్నారు. అప్పుడే తమ భూముల్లో అభ్యంతరాలు తెలపగలమని రైతులు అంటున్నారు.

హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తాం

నోటిఫికేషన్ విడుదల అయిన నెల రోజుల్లోపు అభ్యంతరాలు తెలుపుకోవచ్చు. మ్యాపులకు సంబంధించి కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి, వారికి తగిన సలహాలు, సూచనలు ఇస్తాం. అవసరమైన వారికి మ్యాపులు అందిస్తాం.

– హేమంత్‌కుమార్, తహశీల్దార్



పులి దాడిలో మృతి చెందిన లేగ దూడ

అమ్మో పులి

రెండు మూగజీవాలపై దాడి

ప్రజాశక్తి -మెంటాడ

పులి మళ్లీ పంజా విసిరింది. అనంతగిరి మండలం రాభ గ్రామానికి సమీపంలో శనివారం తెల్లవారుజామున ఆవు, లేగదూడను హతమార్చింది. మెంటాడ మండలం అనంతగిరి కొండల్లో పులి మకాం వేసిందని గిరిజనులు తెలిపారు. నిత్యం అక్కడ తమకు తారస పడుతూనే ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. నిత్యం కొండల్లోకి వెళ్లిన మూగజీవాలపై దాడికి పాల్పడుతోంది. అక్కడ గిరిజనులు మూకుమ్మడిగా గాలిస్తే మెంటాడ మండలంలోకి చొరబడుతోంది. గతేడాది మండలంలోని బిరసాడవలస వద్ద ప్రత్యక్షమైన పులి.. బొండపల్లి, గజపతినగరం, మెరకముడిదాం, దత్తిరాజేరు తదితర మండలాల్లో సంచరిస్తూ మూగ జీవాలపై దాడులకు పాల్పడింది. మైదాన ప్రాంతాల్లో జరిగిన ఘటనలు మాత్రమే వెలుగులోకి వస్తున్నాయి. మూడు నెలలుగా స్తబ్దతగా ఉన్న పులి మండల సరిహద్దులో కనిపించింది. దీంతో పశువుల కాపరులు బయటకు వెళ్లేందుకు భయపడుతున్నారు. ఒంటరిగా పొలాలకు వెళ్లేందుకు రైతులు సంకోచిస్తున్నారు.

బిల్లులను అప్‌లోడ్ చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం

చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయడంతోపాటు, వాటికి త్వరగా బిల్లులను ఇప్పించాల్సిన బాధ్యత కూడా మనపై ఉందని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. రాజాం నియోజకవర్గంతోపాటు పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురం, కురుపాం, సాలూరు, పాలకొండ నియోజకవర్గాల్లో ఉపాధి హామీ కన్వర్జెన్సీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులపై జెడ్‌పి సమావేశ మందిరంలో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, పూర్తి చేసిన పనులకు ఇప్పటికే చాలా వరకు బిల్లులను అప్‌లోడ్ చేశామన్నారు. ఇంకా మరికొన్ని విభాగాల్లో బిల్లులు పెండింగ్ ఉన్నాయని, వాటిని కూడా అప్‌లోడ్ చేసేందుకు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఏదైనా సాంకేతిక సమస్యలు ఉంటే, వివిధ శాఖలు సమన్వయంతో, వెంటవెంటనే పరిష్కరించుకొని, యుద్ధప్రాతిపదికన 24 గంటల్లో బిల్లులన్నీ అప్‌లోడ్ చేసేందుకు సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్‌పి డిప్యుటీ సిఇఒ కె.రాజ్‌కుమార్, విజయనగరం డ్వామా పీడీ జి.ఉమాపరమేశ్వరి, మన్యం జిల్లా డ్వామా పీడీ కె.రామచంద్రరావు, పంచాయతీరాజ్ ఎస్ఇ ఎంవిఆర్ కృష్ణాజీ, రెండు జిల్లాల వివిధ శాఖల అధికారులు, ఎంపిడిఒలు, ఉపాధిహామీ ఎపిఒలు, ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

3483 టన్నుల మొక్కజొన్న కొనుగోలు

వారం రోజుల్లో రైతులకు చెల్లింపులు : జెసి

విజయనగరం : మార్క్ఫెడ్ ద్వారా జిల్లాలో ఇంతవరకు 3483.500 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేశామని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర రూ.1962 కల్పించడం వలన రైతులంతా కొనుగోలు కేంద్రాలకు విచ్చేసి తమ పంటను విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలో రబీ సీజన్ లో 59149 హెక్టార్లలో సాగు చేయగా 207109 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చిందని తెలిపారు. ఆరుగాలం పండించిన పంట దళారుల వ్యాపారుల పాలు కాకుండా అన్నదాతలకు గిట్టుబాటు ధర కూడా అధికంగా ఉండడంతో విక్రయాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. జిల్లాలో 160 కేంద్రాల్లో 648 రైతుల నుంచి 6.78 కోట్ల విలువ గల మొక్కజొన్న 3483.500 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామన్నారు. అందులో 281 మంది రైతులకు 3.42 కోట్లను రైతులకు నేరుగా వారి ఖాతాలోకి వేశామన్నారు.

సాయి సరస్వతి కోచింగ్ సెంటర్‌లో

నేడు టాలెంట్ టెస్టు

విజయనగరం : నగరంలోని కామాక్షినగర్‌లోని శ్రీ సాయి సరస్వతి కోచింగ్ సెంటర్ ఫర్ సైనిక్ స్కూల్స్ ఆధ్వర్యంలో సైనిక్, నవోదయ తదితర వాటికి కోచింగ్ తీసుకొనే విద్యార్థులకు ఆదివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఉచితంగా టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ బి. శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉడాకాలనీలోని పాత నేషనల్ పబ్లిక్ స్కూలులో పరీక్ష జరుగుతుందని తెలిపారు. మూడో తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని తెలిపారు. ఈ టెస్ట్‌లో 90 శాతం మార్కులు వచ్చిన వారికి 75శాతం ఫీజు రాయితీ, 80 శాతం మార్కులు వచ్చిన వారికి 50 శాతం ఫీజు, 70 శాతం మార్కులు వచ్చిన వారికి 25 శాతం ఫీజులో రాయితీ ఇస్తామని తెలిపారు. వివరాలకు 96660 34942 నెంబరును సంప్రదించాలని కోరారు.

హాస్టల్ విద్యార్థులను

- వంద శాతం ఉత్తీర్ణత సాధించాల్సిందే
- విద్యార్థుల విద్య, ఆరోగ్యంపై దృష్టిపెట్టాలి : కలెక్టర్ నాగలక్ష్మి

టాపర్లుగా తయారు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల విద్యార్థులను టాపర్స్‌గా తయారు చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. హాస్టల్ విద్యార్థులంతా వచ్చే సంవత్సరంలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని, దీనికోసం విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే తగిన ప్రణాళికను అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల విద్య, ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. మోడల్ స్కూళ్లు, కెజిబివిలు, ఎస్‌సి, బిసి, ఎస్‌టి, వికలాంగ సంక్షేమ వసతి గృహాలు, జ్యోతిభా పూలే బిసి గురుకులాలు, అంబేద్కర్ గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలు, ఎస్ఒలతో కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యాసంస్థలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించామని, ఉన్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు కూడా అందుబాటులో ఉన్నారని చెప్పారు. ఈ మార్పులు పరీక్షా ఫలితాల్లో కూడా కనిపించాలని, ప్రయివేటు విద్యాసంస్థలను తలదన్నే విధంగా, ప్రతీ సంక్షేమ వసతి గృహంలో టెన్త్, ఇంటర్ శతశాతం ఉత్తీర్ణత సాధించాల్సిందేనని స్పష్టం చేశారు. విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే ఈ మేరకు తగిన ప్రణాళికను తయారు చేసుకోవాలని ఆదేశించారు. కేవలం చదువులోనే కాకుండా క్రీడలు, సాంస్కృతిక అంశాలు విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాన్ని గుర్తించి, దానికి పదును పెట్టేందుకు కషి చేయాలని, వ్యక్తిత్వ వికాశంపై దృష్టి పెట్టాలని కోరారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనంలో నాణ్యత లోపిస్తే సహించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. భోజన నాణ్యతను పరిశీలించేందుకు ప్రతీ విద్యాసంస్థలో కమిటీలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. తాగునీరు, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్లు, విద్యుత్‌కు సంబంధించిన అంశాలను పరిశీలించి, సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సహాదిత్ వెంకట త్రివినాగ్, డిఇఒ లింగేశ్వరరెడ్డి, సాంఘిక సంక్షేమాధికారి పివి రత్నం, జిల్లా బిసి సంక్షేమాధికారి ఎం.యశోధనరావు, గిరిజన సంక్షేమాధికారి చంద్రశేఖర్, గురుకులాల జిల్లా సమన్వయాధికారి చంద్రావతి పాల్గొన్నారు.

పరిశ్రమలు మాయ... ఉపాధి భ్రమ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ప్రభుత్వ భూములకు, సాగునీటి వనరులకు కొదవలేదు. కష్టపడే మనస్తత్వంగల జనం కోకొల్లాలు. పరిశ్రమల స్థాపనకు ఇంతకు మించి ఇంకేం కావాలి. అయినా సరే... మన జిల్లా పారిశ్రామికాభివృద్ధిలో అత్యంత వెనుకబడి ఉంది. పాలకుల్లో చిత్తశుద్ధిలోపించడమే ఇందుకు కారణం. ఓవైపు రియల్‌ఎస్టేట్ రంగం ఆకాశాన్ని అంటుతున్నా పట్టుమని పది మందికి ఉపాధి కల్పించే పరిశ్రమలు రావడం లేదంటే విజయనగరం జిల్లాపై స్థానిక పాలకులకు ఉన్న శ్రద్ధ, పాలకుల ముందు చూపు ఏపాటిదో వేరేగా చెప్పనక్కర్లేదు. అలాగని పూర్వం నుంచీ ఉన్న పరిశ్రమలైనా మనుగడలో ఉన్నాయా? అంటే అటువంటి పరిస్థితీ కనిపించడం లేదు. ఇంతకీ ఇప్పుడెందుకు ఈ చర్చ అంటారా...? ఇదిగో పులి... అదుగో మేక అన్నట్టుగా జిల్లా పరిశ్రమల స్థాపనపై చర్చనడుస్తుండడమే ఇందుకు కారణం. ఇటీవల డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్‌పోర్ట్ ప్రొమోషన్ కమిటీ సమావేశం జరిగిన సంగతి తెలిసిందే. పరిశ్రమల స్థాపనకు సకాలంలో అనుమతులివ్వాలని ఆదేశాలు జారీచేశారు. ఈ ఆదేశాలు, ప్రకటనలు చూస్తుంటే జిల్లాకు ఏవో కొత్తకొత్త పరిశ్రమలు వస్తున్నట్టుగా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయన్నట్టుగా ఉన్నాయి. కానీ, ఎక్కడ ఏ పరిశ్రమ పెడుతున్నారు? వాటికి ఎంత భూమి కేటాయించారు? పెట్టుబడులు ఎంత? వాటి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతమందికి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కలుగుతాయి. పెట్టుబడిదారులకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ ఎంత? అన్న విషయాలు ఎక్కడా కనిపించలేదు. పైపైనే చర్చిస్తున్నారా? దాపరికం వహిస్తున్నారా? ఇవన్నీ ప్రజలకు ఎందుకు చెప్పడం అనుకుంటున్నారా? అన్నది కాస్త పక్కనబెడితే... ఉపాధి, ఉద్యోగాల కోసం మాత్రం జిల్లాలోని జనం ఎదురు చూస్తున్నారు. ఇప్పటి జిల్లా నుంచి వలసలు తప్పడం లేదు. వివిధ వృత్తులు కూడా కనుమరుగవ్వడంతో పొట్టచేతపట్టుకు వివిధ పనులకోసం వివిధ ప్రాంతాలకు వలసపోతునే ఉన్నారు. ఐటిఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ వంటి విద్యను అభ్యసించినవారు విశాఖ, హైదరాబాద్, బెంగళూర్ తదితర మహానగరాలకు వెళుతున్నారు. మరోవైపు జిల్లాలో జ్యూట్ మిల్లులు దాదాపు మూతపడ్డాయి. ఒకప్పుడు 20మిల్లులు ఉన్న ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం నాలుగైదుకు మంచి తిరగడం లేదు. ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలకు చెంతనే ముడిసరుకు ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల సహకారం కొరవడడంతో ఇప్పటికే ఉన్న పరిశ్రమలు ఉనికి కోల్పోవాల్సి వస్తోంది. పూసపాటిరేగ ప్రాంతంలో అరకొర పరిశ్రమలు మినహా ఇంకేమీ చెప్పుకోదగ్గ పరిశ్రమలేవీ లేవు. ఉన్న కొద్దిపాటి పరిశ్రమల మూత వల్ల వేలాది మంది ఉపాధి కోల్పోవడంతో ఆయా కుటుంబాలవారి ఆర్థిక స్థితిగతులు దెబ్బతిన్నాయి. జిల్లాకు వస్తున్న వార్షిక ఆదాయంలో పారిశ్రామిక రంగం ద్వారా వస్తున్న ఆదాయం ఏటా తగ్గిపోవడం ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. 2017-18లో 19.3శాతంకాగా, 2018-19లో 17.6శాతానికి తగ్గింది. 2019-20 నాటికి అది 15.9 శాతానికి పడిపోయింది. బొబ్బిలి గ్రోత్ సెంటర్, సారిపల్లి, కంటకాపల్లి, విజయనగరంలోని విటి అగ్రహారం పారిశ్రామిక వాడల్లో పరిశ్రమలకు కేటాయించిన స్థలాలు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికైనా స్థిరమైన ఉపాధిని కల్పించే పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు పాలకులు, జిల్లా అధికార యంత్రాంగం కృషిచేయాలని జనం కోరుతున్నారు.



నిధుల దుర్వినియోగంపై చర్యలేవి?

- విచారణలో తేలినా వదిలేసిన వైనం
- అక్రమాలకు పాల్పడిన హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలని గ్రామస్తుల డిమాండ్

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని పసుపాం జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వరరావు నాడు నేడు నిధులతో పాటు పాఠశాలకు సంబంధించిన నిధులు దుర్వినియోగం చేస్తున్నారంటూ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఒమ్మి రమాదేవి స్పందనలో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి అశోక్ కుమార్‌కి ఆదేశించారు. దాంతో ఆయన అదనపు పథక సమన్వయకర్త, జిల్లా సమగ్ర శిక్ష వారితోపాటు మండల విద్యాశాఖ అధికారితో ఈ ఏడాది ఫిబ్రవరి 21వ తేదీన విచారణ జరిపించారు. విచారణలో భాగంగా పాఠశాలలో అందుబాటులో వున్న అన్ని రికార్డులతోపాటు నాడు నేడు ద్వారా పాఠశాలలో జరిగిన పనులను పరిశీలించారు. పాఠశాలలో నాడు నేడు -1 నందు రూ. 30,65,996లు మంజూరయ్యాయి. అందులో రూ. 29,34,105లు వివిధ పద్దుల నిమిత్తం ఖర్చు చేశారు. వాటిలో రూ.13,23,615లు సిమెంట్ మెటీరియల్ గాను, రూ. 16,10,490లు సివిల్ వర్క్స్ లేబర్ కాంపొనెంట్‌గా ఖర్చు చేశారు. వీటికి సంబంధించి ఎటువంటి రిజిస్టర్లు గానీ, రికార్డులుగానీ, తీర్మానాలు గానీ, చెక్కు ఇష్యూ రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్ గానీ లేకపోవడంతో విచారణ అధికారులు అవాక్కయ్యారు. జూన్ 2021 నాటికి టాయిలెట్ ఓవర్ హెడ్ ట్యాంక్ మినహాయించి మిగిలిన ఎలక్ట్రిఫికేషన్, గ్రీన్ బోర్డ్, రెండు గదులకు టైల్స్, మూడు గదులకు డోర్స్, కిటికీల మరమ్మతులు, సైకిల్ షెడ్, మరుగుదొడ్డి మోడరన్ పనులు పూర్తి అయ్యాయి. సేఫ్టీ గ్రిల్స్ అమర్చారు. వీటికి సంబంధించి కూడా ఎటువంటి రికార్డులు, రిజిస్టర్లు, తీర్మానాలు, క్యాష్ బుక్, బ్యాంక్ పాస్‌బుక్ ఆయన చూపించలేదు. పాఠశాల బీరువాలో స్థలం లేక ఆయన ఇంటి దగ్గర పెట్టుకున్నట్లు విచారణ అధికారులకు తెలిపారు. ఈ పనులకు సంబంధించి మొత్తం మంజూరైన నిధులు, ఖర్చయిన నిధులను కూడా విచారణ అధికారులకు చెప్పలేకపోయారు. ఆయన 9వ తరగతికి భౌతిక శాస్త్రం బోధిస్తున్నట్లుగా తెలిపినను సంబంధిత టైమ్ టేబల్, డైరీగాని చూపలేకపోయారు. ఎఫ్‌ఎ-3కి సంబంధించి తెలుగు, హిందీ, లెక్కలు మార్కులు సెంట్రల్ మార్క్స్ రిజిస్టర్ నందు నమోదు చేయనట్టు గుర్తించారు. ఈ విషయాలు పై విచారణ అధికారులు అడగగా తన పర్యవేక్షణలో రికార్డ్ అసిస్టెంట్ లేరని, ఆన్‌లైన్ పనుల వల్ల రికార్డ్ నిర్వహణలో జాప్యం జరుగుతుందని సమాధానం చెప్పారు. పని భారం ఎక్కువగా ఉండటంతో సమాధానం చేయలేకపోతున్నానని చెప్పారు. గతేడాదికి సంబంధించి ఎస్‌ఎంజి నిధులకు సంబంధించి క్యాష్‌బుక్, పాస్‌బుక్, తీర్మానాలు చూపించలేకపోయారు. నాడు నేడు-1కి సంబంధించి ఫాన్స్, ఎలక్ట్రికల్ వైరింగ్, బోర్ మోటార్ దొంగతనం జరిగిందని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన ఫిర్యాదు గాని, ఎఫ్ఐఆర్ నెంబర్ కానీ చూపించలేకపోయారు. పాఠశాలలో పనిచేస్తున్న ఆయా జీతం కూడా హెచ్‌ఎం గ్లోబల్‌గా చేసినట్టు నివేదికలో తేలింది. దాంతో పాఠశాలలో నిధుల భారీగా అక్రమాలు జరిగాయని విచారణ అధికారులు అంచనాకు వచ్చి నివేదికను ఉన్నతాధికారులకు నివేదించారు. నివేదికలు అందజేసి రెండు నెలలు గడుస్తున్నా ప్రధానోపాధ్యాయుడిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని మండలంలోని విద్యావంతులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు డిమాండ్ చేస్తున్నారు.


పసుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

కరాటేలో ఎల్.కోట విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులు బి.రిషేంద్రకుమార్, జి.భరద్వాజ్ ఇండోనేషనల్ జాతీయస్థాయి కరాటే పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచారు. విశాఖలోని స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో మూడు రోజులుగా జాతీయ కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో కటాస్‌లో 30 కేజీల విభాగంలో రిషేంద్రకుమార్, 40 కేజీల విభాగంలో భరద్వాజ్ సిల్వర్ మెడల్స్ సాధించారు. గోవింద్ తపస్య శర్మ కటా విభాగంలో బ్రాంజ్ మెడల్ పొందారు. టి.సాత్విక్ కాటా విభాగంలో, కుమితి ఫైటింగ్‌లో బంగారు పతకాలు సాధించారు. విజేతలతోపాటు శిక్షకుల రాజును విశ్వర్ షుటోకాన్ కరాటే అసోసియేషన్ ఫౌండర్ ఆర్.మల్లికార్జునగౌడ్ అభినందించారు.

అత్యవసర వైద్యంపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-విజయనగరం

ప్రమాద బాధితులను కాపాడే అత్యవసర వైద్యంపై ప్రతి ఒక్కరు అవగాహన ఏర్పరచుకోవాలని ట్రాఫిక్ డిఎస్‌పి డి. విశ్వనాథ్ విజ్ఞప్తి చేశారు. ఎమర్జెన్సీ మెడిసిన్ దినోత్సవం సందర్భంగా తిరుమల మెడికవర్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది శనివారం కోట వద్ద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విశ్వనాథ్ మాట్లాడుతూ ఎక్కువగా రోడ్డు ప్రమాదాల వల్ల మరణాలు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీటు బెల్టు పెట్టుకోకపోడం, వేగంతమైన ప్రయాణం, మైనర్లు వాహనాలు నడపడం, ఇరుకు రోడ్లలో వాహనాలు నడపడం వంటి కారణాలవల్ల రోడ్డు ప్రమాదాలు అధిక సంఖ్యలో జరుగుతున్నాయని వివరించారు. బాధితులను కాపాడేందుకు వినియోగించే అత్యవసర వైద్యంపై ప్రతి ఒక్కరు అవగాహన కల్పించుకోవడం ఎంతైనా అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో తిరుమల మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ పద్మకుమార్, డాక్టర్ పిఎస్‌వి రామారావు, డాక్టర్ మహేష్, డాక్టర్ శివవరప్రసాద్, డాక్టర్ వెంకటేష్, ఎఒ నారాయణ, ఆసుపత్రి, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

29న వైసిపి ద్విచక్ర వాహన ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నాలుగేళ్ల వైసిపి ప్రభుత్వ సంక్షేమ పాలనకు మద్దతుగా, మా నమ్మకం నువ్వేజగన్ అనే నినాదంతో ఈనెల 29న నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తామని ఆపార్టీ నాయకులు వెల్లడించారు. శనివారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎంపిపి మామిడి అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు నడిపేన శ్రీనివాసరావు, నగర జోనల్ ఇన్చార్జులు బొద్దాన అప్పారావు, డాక్టర్ విఎస్ ప్రసాద్ తదితరులు మాట్లాడారు. ఆ రోజున ఉదయం 9 గంటలకు శాసనసభ ఉపసభాపతి కోలగట్ల నివాసం నుంచి ద్విచక్ర వాహన ర్యాలీ ప్రారంభమై, సిఎంఆర్ సమీపంలోని వైఎస్సార్ సర్కిల్ వరకు కొనసాగుతుందని ప్రకటించారు. పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

భోగాపురంలో..

భోగాపురం : వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా మండలంలోని ఈనెల 29న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు వైసిపి మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ తెలిపారు. బైక్ ర్యాలీ పై నాయకులు, కార్యకర్తలతో శనివారం సమీక్ష నిర్వహించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.


ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి రమేష్, అధికారులు

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి-గజపతినగరం

ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి రమేష్ అన్నారు. శనివారం హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా మండలంలోని పాతబగ్గం గ్రామంలో వైఎస్ఆర్ కాలనీని సందర్శించారు. పంచాయతీ కార్యదర్శి సుజాతను లేఅవుట్ వివరాలను అడగడంతో 31 ఇళ్లు మంజూరయ్యాయని, వాటిలో ఐదిళ్లు పూర్తయ్యాయని వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.సుదర్శన్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ నానిబాబు, ఎపిఎం యు.జగదీష్, గ్రామ పెద్దలు పప్పల గురునాయుడు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవల పరిశీలన

మండలంలో మరుపల్లి పిహెచ్‌సి పరిధిలో అందుతున్న ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రత్యేకాధికారి రమేష్ పరిశీలించారు. శనివారం పిడిశిలలో డాక్టర్ ఎం.సాయికృష్ణారెడ్డి, డాక్టర్ సుష్మ అందిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ సేవల గురించి అడిగారు ప్రతిరోజూ 70 నుంచి 100 మంది వరకు ఒపి చూస్తున్నట్లు వారు తెలిపారు. పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.సుదర్శన్, తహశీల్దార్ ఎం.అరుణకుమారి పాల్గొన్నారు.

ఘనంగా నెహ్రూ వర్ధంతి

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవానికి రాష్ట్రపతిని ఆహ్వానించకపోవడం భారత జాతిని అవమానించడమేనన్నారు. రాష్ట్రపతి గిరిజన మహిళ కావడంతో బిజెపి ప్రభుత్వం వివక్షత చూపుతోందని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'సీతం' విద్యార్థినికి ధీరా ఫౌండేషన్ వితరణ

ప్రజాశక్తి-విజయనగరం

సీతం ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి సంవత్సరం చదువుతున్న మండల త్రివేణి క్యాంపస్‌లో అత్యధిక మార్కులు సాధించినందుకు అభినందిస్తూ ధీరా ఫౌండేషన్ అధినేత డాక్టర్ బొత్స సందీప్ సమాకూర్చిన లాప్ టాప్‌ను మాజీ ఎంపీ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి విద్యార్థినికి అందజేశారు. ఈ సందర్భంలో ఆమె మాట్లాడుతూ ధీరా ఫౌండేషన్ గ్రామీణవిద్యార్థుల ఉన్నతికి పాటుపడుతోందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు, సీతం ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మూర్తి, కళాశాల సిఎస్ఒ సత్యనారాయణ, రెడ్ క్రాస్ రాము పాల్గొన్నారు.



వికలాంగులకు కృత్రిమ అవయవాలు అందిస్తున్న ప్రతినిధులు

వికలాంగులకు చేయూతనివ్వాలి

ప్రజాశక్తి-కొత్తవలస

వికలాంగులకు చేయూతనివ్వాలని అజటెక్ ప్రెసిడెంట్ రూప్ కుమార్ అన్నారు. శనివారం గురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్‌ను కె.వి సుబ్బారావుతో కలిసి ఆయన సందర్శించారు. ముందుగా ట్రస్టు ఆస్పత్రిని సందర్శించారు. ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీశ్ చేస్తున్న సేవలను కొనియాడారు. ఎలాంటి సహాయం కావాలన్నా చేస్తామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 100 మంది వృద్ధులకు రేషన్, 50 మంది వికలాంగులకు పింఛన్లు, మరో 100 మంది వికలాంగులకు కృత్రిమ అవయవాలు, వీల్‌చైర్లు, చెవి మిషన్లు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీశ్, వైస్ చైర్మన్ ఫణీంద్ర పాల్గొన్నారు.

ధాన్యం రవాణా ఛార్జీలపై సమగ్ర విచారణ

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - జామి

గత ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి రవాణా ఛార్జీల నివేదికపై జెసి మయూర్ అశోక్ విచారణకు ఆదేశించారు. ఇప్పటికే జిల్లాలో ధాన్యం కొనుగోలు అవకతవకలపై ప్రజాశక్తి అనేక కథనాలు ప్రచురించింది. ఈ నేపథ్యంలోనే ఈ నెల 22న ధాన్యం కొనుగోల్ మాల్ అనే శీర్షికతో రవాణా, హమాలీ ఛార్జీలు పక్కదారి పట్టడంపై కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన జెసి.. హమాలీ ఛార్జీలు విడుదలకు ఆదేశాలు జారీ చేస్తూనే, రవాణా ఛార్జీలపై అన్ని మండల నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. పిపిసిఎస్ పోర్టల్‌లో నమోదు చేసిన వివరాలపై వ్యవసాయాధికారి, సిఎస్ డిటి ఉమ్మడిగా విచారణ జరిపి, ఆ నివేదికలను పంపాలని ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు రవాణా ఛార్జీలు విడుదల చేయలేదని స్పష్టం చేశారు.

పేదల సొంతింటి కల సాకారం

ప్రజాశక్తి-బొబ్బిలి

జగనన్న ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం అవుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. టిడ్కో లేఅవుట్లో జగనన్న ఇళ్ల నిర్మాణాలను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జగనన్న ఇళ్లను మంజూరు చేసినట్టు చెప్పారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరికి జగనన్న ఇల్లు మంజూరు చేస్తున్నామన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని లబ్ధిదారులను కోరారు. ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, పాల్గొన్నారు.

వాలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

ప్రజాశక్తి-బొబ్బిలి


వాలంటీర్ల సేవలు మరువలేనివని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అన్నారు. గొల్లపల్లి సచివాలయంలో శనివారం వాలంటీర్లకు పురస్కారాలను అందజేసి, సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమల్లో వాలంటీర్ల పాత్ర కీలకమన్నారు. వారి సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం సత్కారం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు టి.సత్యారావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

జామి : మండలంలోని కలగాడ, శిరికిపాలెం పంచాయతీలకు చెందిన వాలంటీర్లకు పురస్కారాలను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ లాభాపేక్ష లేకుండా సేవే పరమావధిగా వాలంటీర్లు ముందుకు సాగుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి సబ్బవరపు అరుణ, జెడ్‌పిటిసి గొర్లె సరయు, కలగాడ సర్పంచ్ సత్యవతి, ఎంపిటిసి చొక్కాకుల రమణమ్మ, వైసిపి మండల అధ్యక్షులు గొర్లె రవికుమార్, జిల్లా ప్రచార కార్యదర్శి గుడివాడ రాజేశ్వరరావు, ఎంపిడిఒ సతీష్ పాల్గొన్నారు.

బొండపల్లి : వాలంటీర్ల సేవా భావం తో పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎంపిపి చల్ల చలంనాయుడు కోరారు. నెలివాడ, అంబటివలస గ్రామాల్లో వాలంటీర్లకు సన్మానాలు చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎ.వేదవతి, తహశీల్దారు శ్రీనివాస్ మిశ్రా, ఇఒపిఆర్‌డి సి.హెచ్ సుగుణాకర్ రావు, సర్పంచులు తాళ్లపూడి కీర్తి, ఎస్.కసవయ్య, ఎంపిటిసిలు టి.అప్పలనాయుడు, సీనియర్ నాయకులు టి.అప్పలనాయుడు, పి.రామునాయుడు, రౌతు సూరిబాబు, కె.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ వ్యవస్థ దేశానికే రోల్ మోడల్

డెంకాడ : రాష్ట్రంలో అమలవుతున్న వాలంటీర్ వ్యవస్థ దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందని ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు అన్నారు. మండలంలోని రఘుమండ, అమకాం పరిధిలో వాలంటీర్లకు శనివారం రఘుమండలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి వాలంటీర్లకు సేవా వజ్ర, సేవారత్న, సేవా మిత్రా పేరుతో ప్రభుత్వం అవార్డుల ఇచ్చి తగిన విధంగా వాలంటీర్లను గౌరవిస్తుందన్నారు. అనంతరం వాలంటీర్లను ఘనంగా సన్మానించి ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, ఎంపిడిఒ డిడి స్వరూప రాణి, సర్పంచులు గూడేల విష్ణు, వెదుళ్ళ వలస ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, అమకాం నాయకులు వినోద్, ఆనంద్, ధర్మ, కోటి పలువురు నాయకులు, కార్యదర్శులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


డెంకాడ.. వాలంటీర్లను సన్మానిస్తున్న ఎంపిపి వాసుదేవరావు, అధికారులు


బొబ్బిలి.. వాలంటీర్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణ

మెరకముడిదాం : గర్భాం, బైరిపురం గ్రామాల్లో శనివారం వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, మాజీ జెడ్‌పిటిసి కోట్ల వెంకటరావు, సర్పంచ్‌లు గాబ్రియేల్, పప్పల విజయ కుమారి, ఉప సర్పంచ్ పప్పల కృష్ణమూర్తి, వైస్ ఎంపిపి కందుల పార్వతి, వైసిపి సీనియర్ నాయకులు పప్పల గ్రహ నేశ్వర రావు, జిల్లా ఆర్య వైశ్య సంఘం ఉపాధ్యక్షులు కందుల మళ్ళి ఖార్జునరావు, శింగారపు రామకృష్ణ, సత్యవరపు చిన బాబు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి- భోగాపురం

బిసి కులగణన చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిన నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి శనివారం వైసిపి నియోజకవర్గ పరిశీలకులు అందవరపు సూరిబాబు, ఎమ్మెల్యే బడికొండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పరిశీలికలు అందవరపు మాట్లాడుతూ బీసీ కులగణన కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. ప్రత్యేకంగా బీసీ కులాల కోసం ఎన్నో కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాకు సహకరించినా నేరమే

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఎవరైనా గంజాయి రవాణా చేసినా, అందుకు సహకరించినా నేరమేనని ఎస్‌ఇబి సిఐ ధర్మారావు స్పష్టంచేవారు. శనివారం మండలంలోని ఐతన్నపాలెం నుండి తాటిపూడి మీదుగా విజయనగరం మార్గంలో గంజాయి అక్రమ రవాణా సాగుతుందన్న సమాచారంతో వాహన తనిఖీలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలు రవాణా చేస్తే 14500 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం దబ్బగుంట గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ ఎన్.రమ్యశ్రీ, ఎమ్‌డి ఇబ్రహీం, ఎస్.కె సత్తార్, బి.రాము, పి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

ఉపాధి హామీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాల్ నాయుడు, ఎంపిడిఒ భాస్కరరావు తెలిపారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇటీవల దిబ్బగుడ్డివలసలో జరిగిన సంఘటనపై వారు స్పందిస్తూ ఇలాంటి అక్రమాలు మండలంలో ఎక్కడా పునరావృతం కాకూడదన్నారు. ఎక్కడైనా అక్రమాలు జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎపిఒ జనార్ధనరావు, ఇసి ఎస్. శ్రీకాంత్ పాల్గొన్నారు.

జులై నెలాఖరులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జూలై నెలాఖరులోగా జగనన్న హౌసింగ్ లబ్ధిదార్లు ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎస్.వి.రమణ మూర్తి సూచించారు. శనివారం కొండవెలగాడలో హౌసింగ్ డే సందర్భంగా జగనన్న కాలనీ నిర్మాణాలను ఆయన పరిశీలించారు ఈ సంధర్భంగా ఆయన గ్రామంలో 42 ఇళ్లు మంజూరు కాగా వాటిలో బెస్ మెంట్ స్థాయిలో 21, బిబిఎల్ 3, రూఫ్ లెవెల్ 3, రూఫ్ కంప్లీట్ 1, నిర్మాణం పూర్తయినవి 14 ఇళ్ళు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది జూలై నెలాఖరులోగా ఇళ్లు మంజూరైన లబ్ధిదార్లు ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికీ నిర్మాణం ప్రారంభించని లబ్ధిదార్లకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు నోటీసులు జారీ చేసి అప్పటికి ప్రారంభించకపోతే ఇళ్లు రద్దు చేయాలని ఆదేశించారు. నిర్మాణంలో ఇబ్బందులు, బిల్లుల చెల్లింపు సమస్యలుంటే సంబంధిత అధికార్ల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి. గిరిబాల, హౌసింగ్ డిఇ జి. మురళీ మోహన్, ఎఇ రేవల్ల పవన్, పంచాయితీ కార్యదర్శి యర్ర రమణ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో అధిక దిగుబడులు

డెంకాడ: నవధాన్యాలు సాగుతో వ్యవసాయం చేస్తే పంటలకు రైతులకు అధిక దిగుబడి వస్తుందని ఉత్తర కోస్తా రీజనల్ టెక్నికల్ అధికారి హేమసుందర్ తెలిపారు. సింగవరం ఆర్ బికేలో శనివారం నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. నవధాన్యాలు వేసిన రైతు కొర్నాన రమణ పొలాన్ని రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం రైతులకు నవధాన్యాలు కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మండల ప్రతినిధి గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మహానాడుకు రూ.5 లక్షలు విరాళం

ప్రజాశక్తి- డెంకాడ

నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్న మహానాడు ప్రాంగణంలో శనివారం నారా చంద్రబాబు నాయుడుకు మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్ రూ. 5,01,116 విరాళం అందజేశారు. పార్టీ బలోపేతానికి ఈ విరాళాన్ని వినియోగించాలని ఆయన చంద్రబాబును కోరారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం

ప్రజాశక్తి-బొబ్బిలి

పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండగలమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.జ్యోతి అన్నారు. పట్టణంలోని కుమ్మరివీధి, రావువారివీధి, పూల్‌బాగ్ సచివాలయంలో శనివారం వ్యక్తిగత పరిశుభ్రతపై కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎప్పటికప్పుడు చేతులు శుభ్రం చేసుకోవాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.

వేపాడ : మండల కేంద్రంలో శనివారం కిశోర బాలికలకు అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కామేశ్వరి మాట్లాడుతూ పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. సమావేశంలో మహిళా కానిస్టేబుల్ శ్రీదేవి, మహాలక్ష్మి, మంగ ఈశ్వరమ్మ, లత, దేవి, బి.రాజేశ్వరి, కృష్ణవేణి, బి.లక్ష్మీబాయి, సూపర్వైజరు భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణానికి రక్షణ

గజపతినగరం : హెల్మెట్ ప్రాణానికి రక్షణ కవచమని ఎస్‌ఐ సిహెచ్ గంగరాజు అన్నారు. స్టేషన్ పరిధిలోని ద్విచక్ర వాహనదారులకు శనివారం హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించి వాహనం నడిపితే ప్రమాద సమయాల్లో ప్రాణాలను రక్షించుకోవచ్చున్నారు. కుటుంబానికి భరోసా కల్పించుకోవచ్చుని చెప్పారు. అనంతరం అవగాహన ర్యాలీని నిర్వహించారు.

వంగర : ద్విచక్ర వాహనంపై ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ ఆర్. జనార్దన్ రావు అన్నారు. ఈ మేరకు వంగర నుండి మగ్గూరు వరకు హెల్మెట్ పెట్టుకుని బైక్ ర్యాలీ నిర్వహించి హెల్మెట్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ హెల్మెట్ పెట్టుకుంటే ఎంతో రక్షణగా ఉంటుందని, హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్ల జరిగే నష్టాలు గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌బికె పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

సింగరాయి గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని శనివారం మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు చెల్లించి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని పిఆర్ ఇంజినీరింగ్ అధికారి ఆలీకి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీసర్పంచ్ ఎన్.వెంకట్రావు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.


ఆర్‌బికెను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ

అభివృద్ధి పనులు వేగవంతం

ప్రజాశక్తి-వేపాడ

అసంపూర్తిగా ఉన్న పనులు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందేలా మండల స్థాయి అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, తహశీల్దార్ కృష్ణంరాజు, ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి : ప్రజా సమస్యలను తెలుసుకుని తక్షణమే పరిష్కరించాలని ఎంపిపి చల్ల చలంనాయుడు అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులతో సమన్వయ సమావేశాన్ని మండల ప్రత్యేకాధికారి దుర్గాప్రసాద్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఎంపిడిఒ వేదవతి, తహశీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే పర్యటనలు

ప్రజాశక్తి - భోగాపురం

ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకే గడపగడపకు పర్యటిస్తున్నామని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. శనివారం మండలంలోని నందిగామ పంచాయతీ నందిగాం, గరే నందిగాం, మాల నందిగాం, సబ్బన్నపేట గ్రామాలలో ఆయన పర్యటించారు. గడపగడపకు పర్యటించి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుండి ప్రజలకు అందుతున్న లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలు వివరిస్తుంటే వెంటనే నమోదు చేసుకొని పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ, సర్పంచ్ గరి మురళీమోహన్‌రావు, సంజీవరావు, నాయుడు, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్లు మైలపల్లి నరసింహులు, వైసిపి నాయకులు పడాల బాను, పడాల శ్రీనివాసరావు, బైరెడ్డి ఎర్రప్పల నారాయణ, దల్లి శ్రీనివాసరావు, సుందర హరీష్, సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, మాజీ ఎంపిటిసిలు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరంతో విజ్ఞానం

ప్రజాశక్తి-డెంకాడ

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంతో పిల్లల్లో విజ్ఞానం పెరుగుతుందని డెంకాడ సర్పంచ్ పి. గౌరి అన్నారు. శనివారం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆమె పరిశీలించారు. శిబిరాలను వినియోగించుకోవడం ద్వారా విద్యార్థుల్లో మేధాశక్తి పెరుగుతోందన్నారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ వై. మహేష్‌ను ఆమె అభినందించారు.

నేరాలు ఘోరాలు

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలోని మధుపాడ సమీపంలో శనివారం బైక్ అదుపు తప్పి జాతీయ రహదారి పక్కనే ఉన్న కాలువను ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రానికి సమీపంలోని చినగొడబ గ్రామానికి చెందిన మూడడ్ల వంశి విజయనగరం వస్తుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. సంఘటనా స్థలాన్ని సిఐ ఎల్.అప్పలనాయుడు, ఎస్‌ఐ సిహెచ్ గంగరాజు పరిశీలించారు. కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని చినబూరాడపేటకు చెందిన బెల్లాన రామునాయుడు (60) ఆటో ఢీకొని రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు పోలీసులు అందించిన వివరాలు ప్రకారం.. మృతుడు రాము నాయుడు విజయనగరంలో కూలీ పనులు చేసుకుని తిరిగి శనివారం ఇంటికి ద్విచక్రవాహనంపై వస్తుండగా కొండవెలగాడలో విజయనగరం వైపు వెళ్తున్న ఆటో ఢీకొని మృతి చెందాడు. మృతుడుకు భార్య, పిల్లలు ఉన్నారు. ఎస్‌ఐ పి. నారాయణ రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.